క్లుప్తంగా

తుల్జాభవాని అమ్మవారి ఉత్సవాలు



ఖిల్లాఘనపురం: మండలంలోని ఆముదంబండతండాలో బుధవారం తుల్జాభవాని అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తండాకు చెందిన గిరిజనులు తమ ఇష్టదైవమైన పోషమ్మ(తుల్జాభవాని) ఉత్సవాలను పోటీ పడి నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారి పూజలు చేపట్టిన గిరిజనులు రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఒక్కరి ఇంటి ఎదుట ధాన్యం బస్తాలు, బంతి పూలతో పాటుగా పలురకాల పూలు తదితర వాటితో మండపాన్ని ఏర్పాటు చేసిన గిరిజనులు అమ్మవారిని మండపాలలో ఉంచి పూజలు చేశారు. అమ్మవారి ఎదుట గొర్రె పొటేళ్లను కోసి మొక్కులు తీర్చుకున్నారు. పండుగ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గిరిజన పాటలకు నృత్యాలు చేశారు.

ఘనంగా ఇరుముడి పూజలు



పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప మాలధారులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో 58 ఇరుముడి ధరించి శబరికి బయలుదేరారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



పెబ్బేరు రూరల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తుండడంతో శ్రీరంగాపురం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, రాములుయాదవ్ స్థానిక నాయకులతో కలిసి బుధవారం పటాసులు కాల్చి సంబరాలు జరిపారు. అనంతరం ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.

బాధిత కుటుంబానికి పోలీసుల సాయం



పాన్‌గల్: మండలంలోని అన్నారం చెందిన డ్రైవర్ బాలపీరు గత నెల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్‌ఐ వేణు, సిబ్బంది కలిసి రూ.10 వేలు, బియ్యం బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. దీనిపై బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీసులను అభినందించారు.

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని 2వార్డుకు చెందిన జరీనా అనారోగ్యంతో మృతి చెందడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు రూ.5వేలు బుధవారం అందించారు. కార్యక్రమంలో దయాకర్‌రెడ్డి, జగదీశ్వర్, యుగంధర్‌రెడ్డి, షకీల్, ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



అమరచింతలో..



మోజర్లలో..



కొత్తకోట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో..



శ్రీరంగాపురంలో..



ఆత్మకూర్‌లో..



జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తిటౌన్: అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరంచుకుని జిల్లా కేంద్రంలోని విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ మాట్లాడుతూ.. ప్రపంచంలో దేశ ఔన్నత్యం పెరిగేందుకు అంబేడ్కర్ ప్రతిభాపాటవలే కారణమన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో, పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజీఏసీ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాన్‌గల్: అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు రామస్వామి, సర్పంచ్ జయకళ అన్నారు. బుధవారం మండలంలోని మల్లాయిపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

వీపనగండ్ల: అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కతలప్ప, ఏపీఓ శేఖర్‌గౌడ్, సర్పంచ్ విజయ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరంచుకుని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కొత్తకోట రూరల్: అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పెద్దమందడి మండలంలోని మోజర్లలో గ్రామస్తులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీపీ రఘుప్రసాద్, సర్పంచ్ సునిత తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు ముందుకు తీసుకెళ్లాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి అయ్యుబ్‌ఖాన్ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరంచుకుని పట్టణంలోని విగ్రహనికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. దళిత సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు విగ్రహానికి పూలమాలలు వేశారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం, పెబ్బేరు, వనపర్తి మండలంలోని గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.

కొత్తకోట రూరల్: అంబేడ్కర్ భావితరాలకు స్ఫూర్తి ప్రదాత అని ఎంపీపీ గుంత మౌనిక అన్నారు. బుధ వారం మండల పరిషత్ ఆవరణలో అంబేడ్కర్ వి గ్రహానికి తహసీల్దార్ బాల్‌రెడ్డి, ఎంపీడీఓ కృష్ణ య్య, ఎంపీపీ పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

మదనాపురం: మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జగదీష్, వేమన్న, శ్రీనివాసులు, కోటేష్ పలువురు పాల్గొన్నారు.

ఆత్మకూర్: అంబేడ్కర్ అందరికి ఆదర్శనీయుడని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సీఐ రత్నం, ఎస్ఐ నరేందర్ అన్నారు. ఆత్మకూర్‌లో వేర్వేరుగా కాంగ్రెస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

చిన్నచింతకుంట: ఉంద్యాల, చిన్నచింతకుంటలో అంబేడ్కర్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



వీపనగండ్లలో..



మదనాపురం మండల కేంద్రంలో..



ఉంద్యాలలో..



పాన్‌గల్‌లో..

రేచింతలకు బస్సు బంద్



ఆత్మకూర్ బస్టాండ్‌లో బస్సుకోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఆత్మకూర్: వనపర్తి ఆర్టీసీ డిపోకు చెందిన రేచింతల బస్సు అర్ధాంతరంగా రద్దు చేయడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. బుధవారం సాయంత్రం 4గంటలకు రావాల్సిన బస్సు రాత్రి 8 గంటలు దాటినా రాకపోవడంతో చంటిపిల్లలతో మహిళలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. బస్సు ఎందుకు రాలేదని అడుగుదామంటే ఆర్టీసీ అధికారులు ఎవరూ లేకపోవడంతో ప్రయాణికులు దిక్కుతోచని స్థితిలో బస్టాండ్‌లోనే పడిగాపులు కాశారు. తిప్పడంపల్లి, ఆరేపల్లి, కత్తేపల్లి, తూంపల్లి, వీరరాఘవపూర్, రేచింతలకు చెందిన 50 మందికిపైగా ప్రయాణికులు ఆర్టీసీ అధికారుల నిర్వాకంపై మండిపడ్డారు. కొంత మంది వనపర్తి ఆర్టీసీ అధికారులతో ఫోన్ ద్వారా విషయం తెలపడంతో బస్సు రావడం లేదని చావు కబురు చల్లగా చెప్పడంతో ఉదయం వచ్చిన బస్సు సాయంత్రం ఎందుకు రాదని ప్రశ్నించారు. రేచింతల బస్సు ప్రతినిత్యం తిరిగే విధంగా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని ఆయా గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.

మాదిగలకు ఉప ముఖ్యమంత్రి ఇవ్వాలి

కొల్లాపూర్ రూరల్: రాష్ట్రంలో కొలువుదీరనున్న కాంగ్రెస్ కొత్త ప్రభుత్వంతో మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు డీకే కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని నార్లాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. మంత్రి వర్గంలో మాదిగలకు న్యాయం చేయాలన్నారు. ఉప ముఖ్యమంత్రి ఇవ్వకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో దండోరా నాయకులు పాల్గొన్నారు.

బస్టాండ్‌ను పట్టించుకోరా?



అమరచింతలో నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్

అమరచింత: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆదరణ లేక శిథిలావస్థకు చేరువలో ఉన్న సంబంధిత ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణ ప్రాంగణమంతా నిర్మానుష్యంగా తయారవుతుంది. బస్టాండ్‌ను ప్రారంభించి 24ఏళ్లు గడుస్తున్న బస్సులు మాత్రం ఆగడం లేదు. ఆర్టీసీ అధికారులకు ఎన్ని పర్యాయాలు ఫిర్యాదు చేసిన బస్టాండ్ రుపురేఖలు మాత్రం మారడం లేదు. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న ప్రయాణికులు తమ గమ్య స్థానాలకు వెళ్లడానికి బస్టాండ్‌కు వెళ్లకుండా చౌరస్తాలో నిల్చోని బస్సుల కోసం ఎదురు చూసున్న పరిస్థితులు దాపరించాయి. బస్సులు బస్టాండ్‌లోనే నిలవాలని పట్టుబట్టడంతో గద్వాల డిపో బస్సులు మాత్రం బస్టాండ్‌లో ఇప్పటికి ఆగుతున్నాయే తప్ప ఇతర డిపోలకు చెందిన బస్సులు ఆగడం లేదని ప్రయాణికులు తెలుపుతున్నారు.

సామగ్రి చోరీ..

బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కుర్చీలు, బెంచీలు, ఫ్యాన్లు, విద్యుత్ బల్బులు చోరీకి గురవ్వడంతో ఆర్టీసీ అధికారులు మరోమారు వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయలేకపోయారు. మరుగుదొడ్లు సైతం మరమ్మతు చేయకపోవడంతో మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

యువకుల శ్రమదానంతో..

శిథిలావస్థలో ఉన్న బస్టాండ్‌ను స్థానిక యువకులు కలిసికట్టుగా శ్రమదానంతో శుభ్రం చేశారు. విరాళాలు పోగుచేసి పెయింటింగ్, లైటింగ్ పనులను చేయించారు. దీంతో బస్టాండ్ రూపురేఖలు మారిపోయిన అధికారుల్లో మాత్రం మార్పురావడం లేదు.



బస్టాండ్ ప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి

పట్టించుకోని మున్సిపల్

మున్సిపాలిటీ కేంద్రంలో బస్టాండ్ ప్రాంగణం ఉన్నా వినియోగంలోకి తీసుకొద్దామన్న ఆలోచన మున్సిపల్ అధికారులకు, పాలక మండలి సభ్యులకు కలగడం లేదు. మహిళలు మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవని ఇబ్బందులు పడుతున్నా నిరుపయోగంలో ఉన్న మరుగుదొడ్డిని మరమ్మతు చేయలేక పోతున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరనున్న ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీపీఆర్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మరికంటి బాల్‌రాజ్, విజయభూషణ్‌లు ఒక ప్రకటనలో కోరారు. సీపీఎస్ విధానం రద్దు, పోస్టుల భర్తీ, జాబ్‌క్యాలెండర్, పదోన్నతులు వంటి వాటిపై దృష్టి పెట్టాలని అన్నారు.

షట్టర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



అడ్డాకుల: కందూర్ స్టేజీ వద్ద పెద్దవాగులో నిర్మిస్తున్న చెక్‌డ్యాం వద్ద షట్టర్‌ను ఏర్పాటు చేయాలని గుడిబండ రైతులు విజ్ఞప్తి చేశారు. చెక్‌డ్యాం నిర్మాణ పనుల వద్దకు బుధవారం వెళ్లి కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. చెక్‌డ్యాం కింద నుంచి గుడిబండ చెరువుకు నీళ్లు వెళ్లడానికి గతంలోనే కాలువ ఉందని, ఇప్పుడు ప్రత్యేకంగా ఓ షట్టర్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా నీటిపారుదలశాఖ అధికారుల పరిశీలన తర్వాత చెక్‌డ్యాం వద్ద షట్టర్ ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు గురువారం వాగ్దేవీ జూనియర్ కళాశాల తరపున స్టడీ మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి తమ మెటీరియల్‌తో విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు.

జీపీ భవన నిర్మాణం పరిశీలన

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నెలో నిర్మిస్తున్న పంచాయతీ భవన పనులను మండల అభివృద్ధి అధికారి కతలప్ప బుధవారం పరిశీలించారు. త్వరగా భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆయన సర్పంచ్ విజయ్‌కుమార్‌ను సూచించారు. అంతకుముందు ఆయన గ్రామంలో రోడ్లకు ఇరువైపుల మొక్కలను నాటించారు. గతంలో నర్సరీల్లో ఉన్న మొక్కలను పెద్ద సైజ్ కవర్లలోకి మార్చాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి విక్రమ్, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



జీపీ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కతలప్ప

గ్రామాల స్థితిగతులు, వనరులపై అవగాహన



గుమ్మడంలో రైతులతో కలిసి విద్యార్థులు

కొత్తకోట రూరల్: కృషి విజ్ఞాన కేంద్ర మధనాపురం, మల్లారెడ్డి వ్యవసాయ కళాశాల హైదరాబాద్ వారి సహకారంతో గ్రామీణ పరిస్థితులు, వనరులపై బుధవారం మండలంలోని కనిమెట్టలో రైతులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలోని రామాలయం వద్ద గ్రామ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి అందులో వనరులు, విద్యా, వైద్యం, వ్యవసాయ వననరులు వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. గ్రామంలో సాగయ్యే ప్రధాన పంటలు, వాటిపై ఆశించే చీడపీడలు, సమగ్ర పోషకాల యాజమాన్యం, జీవన ఎరువులు, అధిక రసాయనిక ఎరువులు వాడకం వల్ల కలిగే అనార్థాలు, రాబోయే కాలంలో వచ్చే వాతావరణ మార్పులు, యాంత్రీకరణ, జీవనియంత్రణ పద్ధతులపై వివరించారు.

పెబ్బేరు రూరల్: ఆధునిక వ్యవసాయ పద్ధతులపై మల్లారెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థులు క్షేత్రస్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించారు. అవసరాలు, ప్రాధానత్యలను గుర్తించడానికి, అందుబాటులో ఉన్న వనపరులను అంచనా వేయడానికి బుధవారం మండలంలోని గుమ్మడంలో రైతువేదికలో అనుభవజ్ఞులైన రైతుల నుంచి విద్యార్థులు సమాచారాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

పల్లె ప్రకృతివనాలపై నిర్లక్ష్యం

- ఉమ్మడి మండలంలో 28 ఏర్పాటు
- పట్టించుకోని పంచాయతీలు
- కొన్ని గ్రామాల్లో బహిర్భూమిగా వినియోగిస్తున్న ప్రజలు

గోపాల్‌పేట: పల్లెల్లో ఒకే దగ్గర 2వేల మొక్కలు నాటి చిన్నపాటి వనం సంవత్సరం క్రితం ప్రభుత్వం పల్లెప్రకృతి వనాలు ఏర్పాటు చేసింది. మొదట వాటికి వాటర్ క్యూరింగ్, మెయింటెనెన్స్ ఉపాధి కూలీలకు అప్పగించి వాచర్స్‌ను పెట్టి పల్లె ప్రకృతి వనంలో కలుపు తీయడం, నీరు పట్టడం వంటివి చేసేవారు. కొన్ని రోజుల తర్వాత వాటి మెయింటెనెన్స్‌ను పంచాయతీలకు అప్పగించారు. దీంతో పంచాయతీ సిబ్బంది వారి పనులు వారు చూసుకోవడమే అవుతుండడంతో పట్టించుకోవడం మానేశారు. దీంతో ప్రకృతివనాల్లో మొక్కలతో పాటు కలుపు, పిచ్చిమొక్కలు పెరిగాయి. అధికారులు స్పందించి పల్లెప్రకృతి వనాలను అందుబాటులోకి తీసుకురావాలిని ప్రజలు కోరుతున్నారు.

ఉమ్మడి మండలంలో

గోపాల్‌పేట మండలంలో మొత్తం 25 పల్లెప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. అలాగే రేవల్లి మండలంలో 13 ఏర్పాటు చేశారు. ఒక్కో పల్లెప్రకృతి వనం ఏర్పాటుకు ప్రభుత్వం రూ.2లక్షలు వెచ్చించింది.



రేవల్లిలో పిచ్చిమొక్కలు మొలిచి తాళం వేసి ఉన్న పల్లెప్రకృతి వనం

రేవల్లి మండల పల్లెప్రకృతి వనాన్ని తాళం వేసి ఉంచడంతో వనంలో పిచ్చిమొక్కలు పెరిగాయి. కలుపుమొక్కలు పెరిగి నిర్మానుష్యంగా మారింది. గోపాల్‌పేటలోని ఏర్పాటు చేసిన ధన్‌సింగ్ తండా పల్లెప్రకృతి వనంలో ప్రతిరోజూ జనాలు బహిర్భూమికి వెళ్తున్నారు. కొన్ని ప్రకృతివనాలను యువకులు మద్యం సేవించేందుకు, సిగరెట్లు కాల్చేందుకు వాడుతున్నారు. ఉమ్మడి మండలంలో 38 పల్లెప్రకృతి వనాలకు రూ.76లక్షలు వెచ్చించి ఏర్పాటు చేశారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం

గోపాల్‌పేట మండల కేంద్రంలో ధన్‌సింగ్‌తండాకు సంబంధించిన పల్లెప్రకృతి వనం ఉంది. గతంలో ఉపాధి హామీ వాచర్స్ చూసేవారు. ప్రస్తుతం ఆయా పంచాయతీలు చూస్తున్నాయి. ఎక్కడైనా ఇబ్బంది ఉంటే పరిశీలించి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– ఉసేనప్ప, ఎంపీడీఓ, గోపాల్‌పేట

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: ఉపాధి పనులపై గ్రామాల్లో అవగాహన కల్పించి పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉపాధి పనులకు ప్రతి గ్రామంలో 50 మందికి తగ్గకుండా పనులు చేయాలని, రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నర్సరీల్లో కవర్లల్లో మట్టి నింపడం పనులను పూర్తి చేయాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పట్టాలని, గ్రామాలల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.